# జైల్లో కేజ్రీవాల్‌కు వేధింపులు

**కుటుంబాన్ని కలవడంపైనా ఆంక్షలు**

ఆప్ ఎంపీ సంజయ్ ఆరోపణలు

**నేడు దేశ వ్యాప్తంగా సంవిధాన్ బచావో ఆందోళన**



సంజయ్ సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను జైల్లో వేధిస్తున్నారని, కేంద్రం సూచనల మేరకు ఆయన ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. కనీసం కేజ్రీవాల్‌ను భార్య సునీతా కేజ్రీవాల్‌తో మాట్లాడటానికి కూడా అనుమతించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేజ్రీవాల్ తన భార్యతో కిటికీ ద్వారా మాట్లాడుతున్నారని తెలిపారు. కేజ్రీవాల్‌ను కరుడుగట్టిన నేరస్తుడి మాదిరి పరిగణించటాన్ని ఆయన తప్పు పట్టారు. కరడు గట్టిన నేరస్తులు సైతం తమ బ్యారక్‌లలో సమావేశాలు నిర్వహిస్తారని.. కానీ కేజ్రీవాల్ విషయంలో జైలు అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని విమర్శించారు. కేజ్రీవాల్ అంటే కేంద్రానికి అంత భయమెందుకు? అని ఆయన ప్రశ్నించారు. మరోవైపు ఏప్రిల్ 14న బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో.. తనషాహీ హటావో దివస్' ను పాటిస్తామని ఆమ్‌ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ శనివారం తెలిపారు. ఆదివారం నాడు పార్టీ కార్యకర్తలంతా కలిసి రాజ్యాంగ పీఠికను చదివి రాజ్యాంగాన్ని కాపాడుతామని ప్రమాణం చేస్తారని రాయ్ చెప్పారు. ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాయ్ మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడి చేస్తున్నదని ఆరోపించారు.

**యూపీలో 'ఇండియా'కు ఆప్ మద్దతు**

ఉత్తరప్రదేశ్‌లో ఇండియా కూటమి అభ్యర్థులకు బేషరతుగా మద్దతు ఇస్తున్నట్టు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించింది. ప్రజాస్వామ్యాన్ని రక్షించటానికి, నిరంకుశ ప్రభుత్వాన్ని అంతం చేయటానికి ఈ ఎన్నికలు జరుగుతున్నాయని అభివర్ణించింది. ఆప్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

## సెంచరీ కొట్టాకే అస్త్ర సన్యాసం!

**98 సార్లు ఎన్నికల్లో ఓడిన యూపీ వ్యక్తి**

ఆగ్రా: ఆయన పేరు హస్నురామ్ అంబేద్కరీ. వయస్సు 78 ఏండ్లు. ఇప్పటి దాకా 98 సార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు. తాజాగా మరోసారి రెండు స్థానాల నుంచి పోటీకి సిద్ధమయ్యాడు. యూపీలోని ఆగ్రా జిల్లా ఖేరాఘర్‌కు చెందిన ఈయన ఎన్నికల్లో పోటీ చేయడంలో సెంచరీ కొట్టాకే అస్త్ర సన్యాసం చేస్తానని ప్రకటించాడు. అంబేద్కరీ 1985లో మొదటి సారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. గ్రామ పంచాయతీ, రాష్ట్ర అసెంబ్లీ, ఎమ్మెల్సీ, ఎంపీ ఇలా ప్రతి ఎన్నికల్లో పోటీ చేశారు. మొదటి సారి తనకు బీఎస్పీ టికెట్ ఇస్తానని చెప్పి నిరాకరించిందని.. కారణమడిగితే.. 'నీ భార్య ఓటే నీకు పడదు.. అలాంటిది ఇతరులెలా వేస్తార'ని అవమానించారని చెప్పాడు. అందుకే అప్పటి నుంచి పోటీ చేస్తున్నట్టు చెపారు.

## త్వరలో 'సరిహద్దు మార్చ్'!

**వాంగ్‌చుక్ ప్రకటన**

లేహ్, ఏప్రిల్ 13: త్వరలో 'సరిహద్దు మార్చ్' చేపట్టనున్నట్టు లేహ్ అపెక్స్ బాడీ(ఎల్‌ఏబీ) నేత, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ శుక్రవారం వెల్లడించారు. అయితే ర్యాలీ చేపట్టబోయే తేదీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన తెలిపారు. లడఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించడంతోపాటు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్‌తో ఇటీవల తలబెట్టిన ఈ బోర్డర్ మార్చ్‌పై అధికారులు ఆంక్షలు విధించడంతో పాటు ర్యాలీని ఎల్‌ఏబీ విరమించుకొన్న విషయం తెలిసిందే. కొంత మంది గ్రూపుతో చైనా సరిహద్దులోని చాంగ్‌తాంగ్ వరకు మార్చ్ చేపడుతామని ఎల్‌ఏబీ తాజాగా పేర్కొన్నది. లడఖ్‌కు రాష్ట్ర హోదా డిమాండ్‌తో కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్(కేడీఏ)తో కలిసి ఎల్‌ఏబీ గత నాలుగేండ్లుగా ఆందోళనలు చేస్తున్నది.

# మోదీ పాలనలో

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదని ప్రముఖ సైన్స్ జర్నల్ 'ది లాన్సెట్' ఘాటుగా విమర్శించింది. దేశంలో ప్రజల ఆరోగ్య సంరక్షణ చర్యలు అంతంత మాత్రంగా ఉన్నాయని దుయ్యబట్టింది. అవసరంలో ఉన్నవారికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందడం లేదని తెలిపింది. ఆరోగ్య సంరక్షణ రంగంపై ప్రభుత్వ వ్యయం తగ్గిపోయిందని, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో కేవలం 1.2 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నదని చెప్పింది. ప్రజల జేబులకు భారీగా చిల్లు పడుతున్నదని వివరించింది. 'భారత దేశంలో ఎన్నికలు : సమాచార పారదర్శకత ఎందుకు ముఖ్యం?'' అనే శీర్షికతో ది లాన్సెట్ ఇటీవల ఒక వ్యాసాన్ని ప్రచురించింది.

ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న ప్రజారోగ్య, సార్వజనీన ఆరోగ్య బీమా పథకాలు విఫలమవుతున్నాయని ది లాన్సెట్ విమర్శించింది. ఆరోగ్య సంరక్షణ పథకాలు, ప్రణాళికలు, నిర్వహణ కోసం తాజా సమాచారం తప్పనిసరి అని, కేంద్ర ప్రభుత్వం మాత్రం దీనిని పట్టించుకోవడం లేదని తెలిపింది. కొవిడ్ మహమ్మారి కారణంగా 2021లో జరగాల్సిన జనాభా లెక్కల సేకరణ వాయిదా పడిందని గుర్తు చేసింది. భారత దేశం, ప్రజల గురించి సమగ్ర అధికారిక సమాచారం తెలియకుండాపోయిన దశాబ్దం 150 ఏండ్లలో ఇదేనని చెప్పింది. జాతీయ, రాష్ట్ర స్థాయి ఆరోగ్య సర్వేలకు కూడా తాజా జనాభా లెక్కలు అవసరమని తెలిపింది. రోగాల బారిన పడటం, వాటిని నయం చేసుకోవడానికి ప్రజలు చేసే ఖర్చు వంటివాటిపై నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ నిర్ణీత కాలంలో క్రమబద్ధంగా సర్వే చేయవలసి ఉంటుందని, దీనిని ఇప్పట్లో నిర్వహించే సూచనలు కనిపించడం లేదని తెలిపింది. జనన, మరణాలకు సంబంధించిన నమ్మదగిన సమాచారం శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ సర్వే నివేదికలో ఉంటుందని, దీనికి సంబంధించిన 2021నాటి నివేదికను విడుదల చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతున్నదో చెప్పడం లేదని తెలిపింది. పేదరికానికి సంబంధించిన సర్వే నివేదికలను కూడా కేంద్రంలోని బీజేపీ సర్కారు బయట పెట్టడం లేదని చెప్పింది.

# ప్రజారోగ్యం దివాలా

## కేంద్ర పథకాలు విఫలమవుతున్నాయని విమర్శ

- బీజేపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఎండగట్టిన 'ది లాన్సెట్'
- జనాభా లెక్కల సేకరణ చాలా ముఖ్యమని స్పష్టీకరణ
- దేశాభివృద్ధికి పెట్టుబడులు పెరగాలని సూచన



వాస్తవ పరిస్థితులను బయటపెట్టడానికి ప్రభుత్వం ఎందుకు భయపడుతున్నదని ది లాన్సెట్ ప్రశ్నించింది. సమాచారం లేకుండా ప్రగతిని ఏ విధంగా మదింపు చేస్తారని నిలదీసింది. తాజా, నమ్మదగిన సమాచారం అందుబాటులో లేకపోతే, ప్రజాస్వామిక ఎంపికలు నీరుగారిపోతాయని చెప్పింది. అభివృద్ధి చెందిన భారత్, 2047 లక్ష్యమని ప్రభుత్వం చెప్తున్నదని, దీనికి చోదకులు ప్రజలు, సేవలేనని, అందువల్ల ప్రభుత్వం ఆరోగ్యం, విద్యలపై దృష్టి సారించి, పెట్టుబడులు పెట్టాలని వివరించింది. సమాచారం బహిరంగంగా, పటిష్ఠంగా అందుబాటులో ఉంటేనే ఇవన్నీ సాధ్యమవుతాయని స్పష్టం చేసింది. సమాచారాన్ని అందుబాటులో ఉంచడాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారంటే, భారతీయులకు సంపూర్ణ సమాచారాన్ని ఇవ్వడం లేదనే భావించాలని తెలిపింది.

## 'భారత్ మాతా కీ జై' అనేందుకు అనుమతిస్తారా!?

**కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను కోరిన ఆ పార్టీ ఎమ్మెల్యే సావడి**


లక్ష్మణ్ సావడి

బెంగళూరు: 'భారత్ మాతా కీ జై' అనే నినాదం చేయడం కోసం అనుమతి ఇవ్వాలని కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మణ్ సావడి తన పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కోరడంపై విమర్శలు వచ్చాయి. కలబురగిలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో లక్ష్మణ్ మాట్లాడుతూ, ''ఖర్గే గారు దీనిని తప్పుగా భావించబోరని ఆశిస్తున్నాను. దీనిని మీరంతా చెప్పాలని కోరుకుంటున్నాను. నేను బోలో భారత్ మాతాకీ జై అంటాను. మీరంతా పిడికిలి బిగించి తిరిగి చెప్పాలి'' అన్నారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడంతో కర్ణాటక బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర స్పందిస్తూ, కాంగ్రెస్ వేదికపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో ఆ పార్టీ సీనియర్ నేత లక్ష్మణ్ బహిరంగంగా 'భారత్ మాతా కీ జై' అనడానికి సందేహించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఓ కాంగ్రెస్ నేత తన దేశభక్తిని వ్యక్తం చేయడానికి ప్రయత్నించడం అపరాధమనే భావనకు లోను కావడం ప్రమాదకరమన్నారు. ఈ నినాదం చేయడం గురించి తన పార్టీ చీఫ్‌కు వివరణ ఇవ్వడం జాలి గొలుపుతున్నదన్నారు. బీజేపీ నేత ఆర్ అశోక స్పందిస్తూ, 'పాకిస్థాన్ జిందాబాద్' అని నినాదాలు చేసినవారిని మంత్రి ప్రియాంక్ ఖర్గే సమర్థించడాన్ని చూసిన లక్ష్మణ్ సావడి 'భారత్ మాతా కీ జై' అని నినదించాలా? వద్దా? అనే సందేహంలో పడ్డారని విమర్శించారు.

## నవమినాడు అయోధ్య రాముడికి సూర్య తిలకం

**ట్రయల్ రన్ విజయవంతం**

అయోధ్య: శ్రీరామ నవమి ఉత్సవాలకు అయోధ్య రామాలయం ముస్తాబవుతున్నది. ఇది దాదాపు 500 సంవత్సరాల తర్వాత అయోధ్యలో జరుగుతున్న అతి పెద్ద వేడుక కావడంతో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి రామయ్య భక్తులు అపురూప ఘట్టాన్ని వీక్షించనున్నారు. 17న శ్రీరామ నవమి నాడు సూర్య భగవానుడు దాదాపు నాలుగు నిమిషాలపాటు బాల రాముడి నుదుటిపై కిరణాలు ప్రసరింపజేయనున్నాడు. దీనినే సూర్యతిలకంగా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు శాస్త్రవేత్తల సమక్షంలో ఇందుకు సంబంధించి నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. ప్రతి శ్రీ రామ నవమి రోజున బాల రామయ్య నుదుటిపై సూర్యకిరణాలు ప్రసరించేలా ఏర్పాటు చేశారు.

**అమెరికాలో భారతీయుడిపై**

## 2 కోట్ల రివార్డు

**భార్యను చంపి పరారైన నిందితుడు**

న్యూఢిల్లీ: తొమ్మిదేండ్ల క్రితం భార్యను దారుణంగా హత్య చేసి పరారైన భద్రేశ్‌కుమార్ చేతన్‌భాయ్ పటేల్ అనే భారతీయుడిపై అమెరికా ప్రభుత్వ దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) భారీ రివార్డు ప్రకటించింది. నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి 2,50,00 డాలర్లు(రూ.2.1 కోట్లు) ఇస్తామని ప్రకటించింది. భద్రేశ్‌కుమార్‌ను ఎఫ్‌బీఐ టాప్–10 మోస్ట్‌వాంటెడ్ జాబితాలో చేర్చింది. భద్రేశ్‌కుమార్ తన భార్య పాలక్‌ను 2015, ఏప్రిల్‌లో హత్య చేశాడు. వీరిద్దరూ మేరీలాండ్‌లోని హనోవర్‌లోని ఓ మిఠాయిల దుకాణంలో పనిచేసేవారు. హత్య జరిగిన రోజు ఇద్దరూ నైట్‌షిఫ్ట్‌లో ఉన్నారు. రాత్రి పొద్దుపోయాక దుకాణం వెనుక గదిలో తన భార్య పాలక్‌ను భద్రేశ్‌కుమార్ కత్తితో పలుమార్లు పొడిచి హత్య చేయడం సీసీటీవీలో రికార్డైంది.

## మణిపూర్‌లో ఘర్షణ... ఇద్దరి మృతి

ఇంఫాల్: మణిపూర్‌లోని తూర్పు ఇంఫాల్ జిల్లాలో శనివారం రెండు సాయుధ గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కాంగ్‌పోక్పి జిల్లా సరిహద్దుల్లో ఈ ఘర్షణ జరిగింది. మృతులను గుర్తించవలసి ఉంది. పరిస్థితిని అదుపు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర బలగాలను సంఘటన స్థలానికి తరలించారు. తెంగ్నౌపాల్ జిల్లాలో శుక్రవారం గ్రామ వాలంటీర్లు, గుర్తు తెలియని సాయుధుల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడ్డారు.ఏడాదిగా జాతుల మధ్య ఘర్షణల్లో 219 మంది మరణించారు.

## సందేశ్‌ఖాలీలో మానవ హక్కుల ఉల్లంఘనలు

**ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణలో వెలుగులోకి**

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో ఇటీవల చోటు చేసుకొన్న హింసాకాండ, లైంగిక దాడుల ఆరోపణలు నిజమేనని జాతీయ మానవ హక్కుల కమిషన్ శనివారం తెలిపింది. కమిషన్ జరిపిన స్పాట్ విచారణలో సందేశ్‌ఖాలీలో అనేక మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని వెల్లడైంది. స్థానికులకు కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదని తేలింది. రాష్ట్ర, కేంద్ర ప్రథకాలను ఈ ప్రాంత వాసులకు అందించకుండా వివక్ష చూపారని కమిషన్ వెల్లడించింది. స్థానికుల ఓటు హక్కును కూడా హరించారని ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది. ఇంత జరుగుతున్నా స్థానిక అధికార యంత్రాంగం స్పందించలేదని కమిషన్ ఆరోపించింది. మొత్తం వ్యవహారంపై 8 వారాల్లోగా తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని ఆదేశించింది.

## షాపింగ్ మాల్‌లో దాడి.. ఆరుగురి మృతి

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో దారుణం చోటుచేసుకుంది. షాపింగ్ మాల్‌లోకి దూసుకొచ్చిన ఓ దుండగుడు అక్కడివారిపై విచక్షణారహితంగా కత్తితో దాడికి తెగబడ్డాడు. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్టు న్యూ సౌత్‌వెల్స్ పోలీస్ అధికార ప్రతినిధి తెలిపారు. శనివారం మధ్యాహ్నం నగరంలోని బోండీ జంక్షన్ వెస్ట్‌ఫీల్డ్ మాల్ కొనుగోలుదారులతో కిటకిటలాడుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి పాల్పడ్డ దుండగుడు ఎవరు? అన్నది ఇప్పుడే చెప్పలేమని పోలీసులు అన్నారు. మొత్తం 8 మందికి గాయాలయ్యాయని, నిందితుడిని ఘటనా స్థలంలోనే హతమార్చారు.

## తప్పుడు అనువాదం.. తప్పని అవమానం!

**గూగుల్‌ను నమ్మి 'హంతకుడి' ఎక్స్‌ప్రెస్‌గా మార్చారు!**

తిరువనంతపురం, ఏప్రిల్ 13: గూగుల్‌ను నమ్ముకుంటే నవ్వులపాలు కావటమే కాదు.. అవమానాల పాలు కూడా అవుతారనడానికి ఈ సంఘటనే ఉదాహరణ. ఒక నగరం పేరును తప్పుగా అనువాదం చేయటంతో ఆ నగరానికి వచ్చే రైలు పేరు కాస్త మర్డరర్(హంతకుడి) ఎక్స్‌ప్రెస్‌గా మారిపోయింది. జార్ఖండ్ రాజధాని రాంచిలోని హటియా నుంచి కేరళలోని ఎర్నాకుళం నగరాల మధ్య వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఒకటి నడుస్తున్నది. హిందీ పదమైన హతియాను మలయాళంలో అనువదించే సమయంలో ఓ తప్పు దొర్లింది. 'హటియా'ను కాస్త 'హతియా' (హంతకుడి) అనుకుని దాన్నే మలయాళం లో 'కొలపథకం'గా రాశారు. అదే పేరుతో ఉన్న నామ ఫలకాన్ని రైలుకు తగిలించారు. ఆ బోర్డు కాస్త సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. తప్పుడు అనువాదంపై నెటిజన్లు విరుచుకుపడ్డారు. గూగుల్ అనువాదంపై ఆధారపడటం వల్ల ఇలా జరుగుతుందని మండిపడ్డారు.

## బ్రిజ్ భూషణ్‌పై ఎన్నికల కోడ్ కేసు

న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు నమోదైంది. ఉత్తర ప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ నియోజకవర్గంలో నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ఆయన శుక్రవారం పర్యటించారని జిల్లా కలెక్టర్ నేహ శర్మ చెప్పారు. సీఆర్‌పీసీ సెక్షన్ 144 ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉన్న సమయంలో ఆయన పర్యటించారని, ఆయన వాహన శ్రేణిలో 25–30 వాహనాలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన బ్రిజ్ భూషణ్‌పై కాత్రా మార్కెట్ ఏరియాలోని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌ఛార్జి డాక్టర్ నజ్ముల్ ఇస్లామ్ ఖర్గుపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. దీనిపై కేసును నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థిని బీజేపీ ఇంకా ప్రకటించలేదు.

## ఒక్కో ఎమ్మెల్యేకు 50 కోట్లు ఎర

**కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ 'ఆపరేషన్ కమలం'**

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఆరోపణ

**ఐదేండ్లూ తానే సీఎం అని వ్యాఖ్యలు**



బెంగళూరు, ఏప్రిల్ 13: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ 'ఆపరేషన్ కమలం'తో కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. పార్టీ మారేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రూ.50 కోట్ల చొప్పున ఎర చూపిందని పేర్కొన్నారు. ఓ జాతీయ మీడియా సంస్థ తాజా ఇంటర్వ్యూలో సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో కాంగ్రెస్ ఓడిపోతే.. రాష్ట్రంలోని ఆ పార్టీ ప్రభుత్వం కూలిపోతుందంటూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య స్పందిస్తూ 'మా ప్రభుత్వాన్ని కూల్చేందుకు వాళ్లు(బీజేపీ) గత ఏడాది నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల చొప్పున ఆఫర్ కూడా చేశారు. అయితే వారు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి' అని అన్నారు. ఒక్క ఎమ్మెల్యే కూడా తమ పార్టీ నుంచి బయటకు పోరని చెప్పారు. రాష్ట్రంలో తన నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేండ్ల పదవీ కాలం పూర్తి చేసుకుంటుందని సిద్ధరామయ్య విశ్వాసం వ్యక్తం చేశారు. సిద్ధరామయ్య ఆరోపణలను బీజేపీ ఎంపీ ఎస్ ప్రకాశ్ ఖండించారు. సీఎం పదేపదే అలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ఆయనకు మద్దతు తెలుపుతున్న ఓ వర్గం సానుభూతి కోసమే అలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై దృష్టి సారించకుండా సీఎం సిద్ధరామయ్య తప్పుడు ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకొన్నారని ప్రకాశ్ విమర్శించారు.

## బోర్న్‌విటా 'హెల్త్ డ్రింక్' కాదు!

**ఆ క్యాటగిరీ నుంచి తొలగించండి**

ఈ-కామర్స్ సైట్స్‌కు

కేంద్రం ఆదేశం




(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): చిన్నపిల్లలు ఎక్కువగా ఇష్టపడే డ్రింక్స్‌లో ఒకటైన బోర్న్‌విటా.. 'హెల్త్ డ్రింక్' కాదని, ఈ బ్రాండ్ సహా ఇతర కూల్‌డ్రింక్స్, బేవరేజెస్‌ను 'హెల్త్‌డ్రింక్స్' క్యాటగిరీ నుంచి తొలగించాలని ఈ–కామర్స్ సైట్స్, కంపెనీలను కేంద్రం ఆదేశించింది. బోర్న్‌విటాలో చక్కెర స్థాయిలు అత్యధికంగా ఉన్నాయంటూ ఇన్‌ఫ్లూయెన్సర్ రేవంత్ హిమత్‌సింగ్‌కా నిరుడు ఓ వీడియోలో ఆరోపించారు. 100 గ్రాముల బోర్న్‌విటాలో 50 గ్రాములు చక్కెర ఉంటుందన్నారు. విచారణ జరిపిన నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్సీపీసీఆర్) బోర్న్‌విటాలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలు మానుకోవాలని బోర్న్‌విటా తయారీదారు మాండలెజ్ ఇండియాకు నోటీసులు పంపింది.

## డైనోసార్ల కన్నా పువ్వులు పురాతనం!

బ్రిస్టల్: పువ్వులు చూడటానికి సున్నితంగా కనిపిస్తాయి. మానవుడికి తెలిసిన సుమారు 3,50,000 జీవుల్లో అత్యంత విజయవంతంగా పరిణామం చెందినవాటిలో పూల మొక్కలు కూడా ఉన్నాయి. ఇవి పర్యావరణ వ్యవస్థపై ఆధిపత్యం చలాయిస్తాయి, ఆక్సిజన్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తాయి. పూల మొక్కలు 1.70 కోట్ల సంవత్సరాల నుంచి 12.5 కోట్ల సంవత్సరాల పూర్వం డైనోసార్ల(రాక్షస బల్లులు)తోపాటు పరిణామం చెందినట్లు తాజా అంతర్జాతీయ అధ్యయనం వెల్లడించింది. డైనోసార్లు అంతరించినప్పటికీ పూల మొక్కలు నేటికీ నిలిచి ఉన్నాయని తెలిపింది. భూమిపై జీవుల పరిణామం గురించి తెలుసుకోవడానికి పువ్వుల సృష్టికి సంబంధించిన అధ్యయనాలు ఉపయోగపడతాయని చెప్పింది.

# ఏ క్షణాన ఏం జరుగుతుందో?

- ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడికి ఎంతో సమయం లేదు: బైడెన్
- యూఏఈ తీరంలో నౌకను స్వాధీనం చేసుకొన్న ఇరాన్
- కంటెయినర్ షిప్‌లో 17 మంది భారతీయ సిబ్బంది


ఖొమైనీ | నెతన్యాహూ | బైడెన్

టెహ్రాన్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడి చేసేందుకు ఇరాన్ సిద్ధమైందనే వార్తల నేపథ్యంలో.. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అక్కడ పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉన్నది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడికి ఎంతో సమయం లేదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. సిరియా రాజధాని డమాస్కస్‌లోని తమ రాయబార కార్యాలయంపై జరిగిన దాడికి ఇరాన్ ఆదివారంలోగా ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశం కనిపిస్తున్నదని అమెరికా, ఇతర నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలవడంతోపాటు పశ్చిమాసియాలోని తమ బలగాలను కాపాడుకొనేందుకు అమెరికా రెండు విధ్వంసక యుద్ధ నౌకలు, ఇతర సామగ్రిని తూర్పు మధ్యధరా సముద్రానికి తరలించింది.

**తీవ్ర పరిణామాలకు సిద్ధమవ్వాలి!**

దాడి ఊహాగానాలకు బలం చేకూర్చేలా ఇజ్రాయెల్ సంస్థకు చెందిన 'ఎంసీఎస్ ఏరీస్' అనే కార్గో నౌకను ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ శనివారం యూఏఈ తీరం సమీపంలో స్వాధీనం చేసుకొని, ఇరాన్ జలాల వైపు మళ్లించిందని ఆ దేశ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. కాగా, ఈ నౌకలోని 25 మంది సిబ్బందిలో 17 మంది భారతీయులు ఉన్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. వారిని విడిపించేందుకు ఇరాన్ అధికారులతో భారత్ చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. తాజా ఘటనపై ఇజ్రాయెల్ స్పందించింది. పశ్చిమాసియాలో ఘర్షణలను ఎగదోసేలా చర్యలకు పాల్పడుతున్న ఇరాన్ 'తీవ్ర పరిణామాలు' ఎదుర్కోవాల్సి ఉంటుందని, తగిన మూల్యం చెల్లించుకొంటుందని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి వార్తల నేపథ్యంలో ఎయిర్ ఇండియా, లుఫ్తాన్సా సంస్థలు ఇరాన్ గగనతలం వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపేశాయి.

## సెల్ టవర్లు లేకున్నా మొబైల్ కమ్యూనికేషన్స్

**శాటిలైట్ల సాయంతో చైనా ముందడుగు**

బీజింగ్: మొబైల్ కమ్యునికేషన్స్ వ్యవస్థలో 'శాటిలైట్' కనెక్టివిటీని సాధించటంలో చైనా శాస్త్రవేత్తలు విజయం సాధించారు. సెల్ టవర్లు లేకుండానే ఫోన్లలో మాట్లాడుకోవచ్చని చెప్తున్నారు. చైనా రోదసిలోకి పంపిన 'టియాన్‌టాంగ్–1' సిరీస్ ఉపగ్రహాల సంఖ్య మూడుకు చేరుకుంది. దీంతో ఆసియా–పసిఫిక్ ప్రాంతమంతా మొబైల్ శాటిలైట్ కనెక్టివిటీకి మార్గం సుగమమైంది. ప్రపంచంలో శాటిలైట్ కనెక్టివిటీని సపోర్ట్ చేసే స్మార్ట్‌ఫోన్లను తీసుకొచ్చిన మొదటి కంపెనీగా హువాయి ఇప్పటికే గుర్తింపు పొందింది. తాజాగా ఈ జాబితాలో షావోమీ, హానర్, ఒప్పో స్మార్ట్‌ఫోన్ కంపెనీలు చేరాయి. భూకంపాలు, తుఫాన్లు.. వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు 'శాటిలైట్ కనెక్టివిటీ' కీలకపాత్ర పోషిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 'మొబైల్ ఫోన్లకు డైరెక్ట్ శాటిలైట్ కనెక్టివిటీ మరింత పాపులర్ అవుతుంది' అని సైంటిస్టు కూయి వాన్‌జావో అన్నారు.

## కాంగ్రెస్‌ను నమ్మితే మునుగుడే

- టికెట్ ఇస్తానంటే డిప్యూటీ కలెక్టర్ జాబ్ వదిలేశా
- అప్పుడు ఎమ్మెల్యే, ఇప్పుడు ఎంపీ టికెట్ ఇవ్వలే
- మధ్యప్రదేశ్ మాజీ డిప్యూటీ కలెక్టర్ నిషా బంగ్రే ఆవేదన



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీని నమ్మితే నట్టేట్లో మునిగి పోయినట్టేనని, వందేండ్ల చరిత్ర గల ఆ పార్టీ తనకు నమ్మకద్రోహం చేసిందని మధ్యప్రదేశ్‌కు చెందిన మాజీ డిప్యూటీ కలెక్టర్ నిషా బంగ్రే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు.

**అలా నమ్మించి మోసం చేశారు**

చాతర్‌పూర్ జిల్లాలోని లవ్‌కుశ్‌నగర్‌లో సబ్–డివిజనల్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న తనను రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ నేతలు ఆహ్వానించినట్టు బంగ్రే గుర్తు చేశారు. తొలుత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్లా నియోజకవర్గం నుంచి తనను అభ్యర్థిగా ప్రకటిస్తామని అప్పటి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌నాథ్ నమ్మబలికినట్టు వెల్లడించారు. దీంతో తాను ఎంతో కష్టపడి సంపాదించిన కలెక్టర్ కొలువును కూడా వదిలిపెట్టి రాజకీయాల్లోకి వచ్చినట్టు తెలిపారు. అయితే, స్థానిక రాజకీయాల పేరిట ఆమ్లా టికెట్‌ను మరొకరికి కేటాయించారని ఆమె వాపోయారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లోనూ తనకు ప్రాధాన్యం ఇవ్వకుండా మరొకరికి టికెట్ ప్రకటించినట్టు మండిపడ్డారు.

**నెగ్గుకు రావడం ఎంతో కష్టం**

మీడియా ఎదుట ప్రకటనలు చేయవద్దని, కొన్ని అంశాల మీదే మాట్లాడాలంటూ పార్టీ సీనియర్ నేతలు తనపై ఆంక్షలు విధించేవారని బంగ్రే వాపోయారు. కలెక్టర్ ఉద్యోగాన్ని సాధించడం సులభమేనన్న ఆమె.. ఇలాంటి రాజకీయాల మధ్య నెగ్గుకు రావడం ఎంతో కష్టమని తెలిపారు. కాంగ్రెస్ తనతో రాజకీయాలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. తనకు నమ్మక ద్రోహం చేసిన కాంగ్రెస్‌లో ఇకపై తాను కొనసాగలేనన్న ఆమె.. తన ఉద్యోగం తనకు కావాలన్నారు.